మెదక్ చర్చి ప్రాంగణంలో ధర్మసత్రాలు నిర్మించాలి

మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, ఆగస్టు 4 : ఆసియా ఖండంలో ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చి సమీపంలో యాత్రికులకు సత్రాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి తెలిపారు. అక్కడ భక్తుల సౌకర్యం కోసం 25 ధర్మసత్రాల నిర్మాణం చేపట్టాలని ఆయన సంబంధిత మంత్రిని కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించే సత్రాల్లో మరుగుదొడ్లతో పాటు మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రాంగణంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనానికి శ్రీకారం

నేటి నుంచి 9వ తేదీ వరకు జిల్లాలో పలు కార్యక్రమాలు

మెదక్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం.. పచ్చదనానికి శ్రీకారం చుట్టనున్నది. సోమవారం నుంచి 9వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నది. రోజు వారీగా చేయాల్సిన పనుల ప్రణాళికను విడుదల చేసింది. వార్డు, గ్రామ పంచాయతీ టీమ్ సభ్యులు రోజూ ఆయా కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ కలెక్టర్‌కు నివేదిస్తారు. 5న స్థానిక నాయకులు, మహిళా సంఘాలు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, ర్యాలీలు తీస్తారు. రెండో రోజు తాగునీరు, వాననీటి హార్వెస్టింగ్ చేపడతారు. మూడో రోజు డ్రెయిన్లు, ఇంకుడు గుంత ఏరియాలు, గుంతలు పూడ్చడం తదితర పనులు చేపడతారు. నాలుగో రోజు మహిళా సంఘాలు బాధ్యులు, ఆశలు, పాఠశాల సమావేశాల్లో డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తారు. పబ్లిక్ సంస్థలు, పబ్లిక్ స్థలాలు శుభ్రం చేస్తారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల్లో స్థలాలను గుర్తించి మొక్కలు నాటుతారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛదనం-పచ్చదనం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. మునిసిపల్ కమిషనర్లు, జడ్పీ సీఈవో, డీఆర్డీవో, డీపీవో, డీఎల్పీవో క్షేత్రస్థాయిలో పర్యటించి, కార్యక్రమాల అమలుపై నివేదికలు రోజు వారీగా కలెక్టర్‌కు సమర్పిస్తారు. స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ కోరారు.

మార్మోగిన యేసయ్య నామస్మరణ

ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 4 : మెదక్ మహా దేవాలయం (చర్చి) యేసయ్య నామస్మరణలతో మార్మోగింది. ఆదివారం కావడంతో భక్తులు, పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. శనివారం రాత్రి మెదక్ చర్చిని ఎస్పీ ఉదయ్‌కుమార్ సందర్శించారు. చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఎస్పీని శాలువాతో సన్మానించారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ప్రెసీబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య భక్తులనుద్దేశించి మాట్లాడారు. పాస్టర్లు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్ భక్తులను ఆశీర్వదించారు. ప్రార్థనల్లో సీఎస్ఐ కమిటీ సభ్యులు సంపత్, జాన్సన్, సందీప్, సువన్‌డగ్లస్, నోబుల్‌సన్, జాయ్‌ముర్రే తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

బాధిత కుటుంబానికి బియ్యం, ఆర్థిక సాయం చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

చేగుంట, ఆగస్టు 4 : మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన విభూతి రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆదివారం వాసవి క్లబ్ జోన్ చైర్మన్ అయిత పరంజ్యోతి, మాజీ ఎంపీటీసీ అయిత వెంకటలక్ష్మీరఘురాములు బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదుతో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో రఘురాములు, గోపాల్, ఎర్ర యాదగిరి, బక్క దశరథ తదితరులు పాల్గొన్నారు.

కొట్టాలలో తాగునీటి తిప్పలు

- పొలాల బాట పట్టిన మహిళలు
- మరమ్మతులకు నోచుకోని బోరుమోటర్లు
- మిషన్ భగీరథ నీళ్లే దిక్కు

వ్యవసాయ పొలంలోకి వెళ్లే బోరు వద్ద నీటి కోసం మహిళల పాట్లు

వ్యవసాయ బోరు నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న మహిళ

కొడిపల్లి, ఆగస్టు 4 : మండల పరిధిలోని కొట్టాలలో వారం రోజుల నుంచి తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం పొలాల్లోని వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో నల్లాల ద్వారా తాగునీరు రాకపోవడంతో పలుమార్లు కార్యదర్శి మల్లేశం దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ నీరు వాల్వ్ బంద్ చేస్తున్నారని, గ్రామంలో ఉన్న సింగిల్ ఫేజ్ మోటర్లు మరమ్మతుకు నోచుకోవడం లేదని, గ్రామ పంచాయతీకి నిధులు లేక ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. వర్షాకాలంలో తాగునీటి కొరత ఏంటని గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు. గతంలో ఇలాంటి సమస్య ఎప్పుడూ రాలేదని, ఇప్పుడు కొత్తగా గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో మహిళలు, యువకులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న నాలుగు సింగిల్‌ఫేజ్ మోటర్లు మరమ్మతులు చేయించకపోవడంతో మిషన్ భగీరథ నీరే దిక్కైంది. అసలే నాట్ల సీజన్ కావడంతో ఎప్పుడు వర్షం పడితే అప్పుడు గ్రామస్తులు తమ కున్న వ్యవసాయ పొలం పనుల్లో నాటు వేసుకోవడంతో పాటు కూలీ చేసుకునే సమయంలో ఇలా తాగునీరు రాకపోవడంతో పనులు మానేసి ఇంటి వద్దనే తాగునీటికోసం ఎదురుచూస్తూ ఉండాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ఆంజనేయులు (ఫైల్)

శివ్వంపేట, ఆగస్టు 4 : పురుగుల మందు తాగి దవాఖానలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. శివ్వంపేట మండలం చెన్నాపూర్ గ్రామానికి చెందిన గుమ్ముల ఆంజనేయులు (40) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. ప్రతి రోజు మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో ఎందుకు తాగుతున్నావని భార్య ఎల్లమ్మ నిలదీయడంతో ఆమెపై చేయిచేసుకున్నాడు. దీంతో భార్య అమ్మగారింటికి వెళ్లగా శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగడంతో సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. భార్య ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

నిజాంపేట, ఆగస్టు 4 : మూడు గంటల్లోనే మిస్సింగ్ కేసును నిజాంపేట పోలీసులు ఛేదించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కల్వకుంట గ్రామానికి చెందిన ఇద్దరు ముస్లిం బాలికలు ఆదివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది బాలికల వద్ద ఉన్న ఫోన్‌ను ట్రాక్ చేసి వారున్న స్థలాన్ని కనుక్కొని వారిని కుటుంబసభ్యులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులను పలువురు అభినందించారు.

జాతీయస్థాయి పోటీల్లో మెదక్ విద్యార్థుల ప్రతిభ

మెదక్ మున్సిపాలిటీ : బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 4 : జాతీయస్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని రెంజుకీ షోటోకాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నగేశ్ తెలిపారు. సన్‌షైన్ షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో రెండో జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలను మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల నుంచి 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పలు విభాగాల్లో మెదక్ పట్టణ విద్యార్థులు 27 బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలను సినీ హీరో ఇంద్రసేన అందజేశారు. పోటీల్లో కరాటే కోచ్‌లు దినాకర్, రియాజ్, విద్యాసాగర్, నిఖిల్, నిత్యసిరి, అబ్దుల్లా, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట: కరాటేలో బంగారు పతకాలు, ప్రశంస పత్రాలతో విద్యార్థులు

నిజాంపేటలో..

నిజాంపేట, ఆగస్టు 4 : హైదరాబాద్‌లో మొదటి జాతీయ స్థాయి సుబ్బు షోటోఖాన్ కరాటే అకాడమీ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న జ్ఞాపకార్థం ఆదివారం కరాటే పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వయస్సు బరువు విభాగాల వారీగా 3 వేల మంది పాల్గొన్నారు. నిజాంపేటకు చెందిన 24 మంది విద్యార్థులు పాల్గొని ప్రతి ఒక్కరూ బంగారు పతకాన్ని సాధించినట్లు మాస్టర్ బ్లాక్ బెల్ట్ సంపత్, గ్రాండ్ మాస్టర్ హరిప్రసాద్ తెలిపారు. బంగారు పతకాలను సాధించిన విద్యార్థులను మాజీ ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు అభినందించారు.

భక్తులతో కిక్కిరిసిన బగలాముఖీ శక్తిపీఠం

శివ్వంపేట : అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మెదక్ రూరల్: కొయ్యగట్టు ఆలయంలో..

శివ్వంపేట, ఆగస్టు 4: ఆషాఢమాసం పుష్యమి నక్షత్రం అమావాస్య సందర్భంగా మండల కేంద్రమైన శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో ఆదివారం భక్తుల రద్దీతో కిక్కిరిసింది. బగలాముఖీ ట్రస్ట్ చైర్మన్, అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో బగలాముఖీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వర్గీయ కొడకంచి అంజాగౌడ్ స్మారకార్థం ఆయన కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, శక్తిపీఠం స్థలదాత పబ్బ రమేశ్ గుప్తా, బగలాముఖీ శక్తిపీఠం ప్రధాన అర్చకుడు బిందు సంతోశ్‌కుమార్ శర్మ, ట్రస్ట్ సభ్యులు పురుషోత్తం శర్మ, శ్రీనివాస్ గౌడ్, శక్తిపీఠం ట్రస్ట్ అధికార సభ్యులు సూర్యంకుమార్ గౌడ్, నాయకులు సుదర్శన్ గౌడ్, రామగౌడ్, రమేశ్‌గుప్తా, కొండల్, రవీందర్ గౌడ్, పోచగౌడ్, వీరస్వామి గౌడ్, రాజీపేట కిశన్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలిపిచెడ్, ఆగస్టు 4 : మండలంలోని చిట్కుల్ శివారులోని ఉన్న చాముండేశ్వరి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమీపంలోని మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ ప్రధాన పూజారి ప్రభాకర్ శర్మ అమ్మవారిని ప్రత్యేక అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కొయ్యగుట్ట మల్లన్నకు ప్రత్యేక పూజలు

మెదక్‌రూరల్, ఆగస్టు 4 : మండల పరిధిలోని మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్ట మల్లన్న స్వామికి ఆదివారం పూజారి మల్లన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పుష్పాంబరి రూపంలో వనదుర్గామాత

పూజలు అందుకుంటున్న వనదుర్గామాత

పాపన్నపేట, ఆగస్టు 4 :ఏడుపాయల వనదుర్గాభవాని మాతను ఆషాఢమాసం చివరి ఆదివారం పురస్కరించుకొని పుష్పాంబరి రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఏడుపాయల కిక్కిరిసిపోయింది. భక్తులు మంజీరానదిలో పుణ్యస్నానాలు చేసి దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో కృష్ణ ప్రసాదు, సిబ్బంది సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింహులు, వర్ణాచారి, రాజు, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. వేదపండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ తదితరులు పూజలు చేశారు. పాపన్నపేట్ ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

రేపు క్రీడాకారుల ఎంపిక

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 4 : స్థానిక ఇందిరా గాంధీ స్టేడియంలో ఈ నెల 6న పదో తెలంగాణ స్టేట్ మెన్, ఉమెన్ అండర్-23, అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-24 పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్స్, జంప్స్, త్రో విభాగాల్లో జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10 గంటల వరకు స్టేడియానికి రావాలన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 10, 11 తేదీల్లో మెదక్‌లోనే జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. మిగతా వివరాలకు 9963005540 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైద్య కళాశాల తరగతులు ప్రారంభించాలి

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 4 : బీఆర్ఎస్ హయాంలో మెదక్‌కు మంజూరైన వైద్య కళాశాలలో తరగతులను ప్రారంభించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీశ్, జిల్లా అధికార ప్రతినిధి నర్సింగ్, నాయకులు సాయి, రాహుల్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే తరగతులను ప్రారంభించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

వాహనాల తనిఖీ

చిలిపిచెడ్, ఆగస్టు 4 : ఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని చండూర్ చౌరస్తాలో ఆదివారం స్థానిక ఏఎస్సై, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై మిస్బొద్దీన్ మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాలను తనిఖీ చేస్తున్నామన్నారు. వాహనాల్లో గంజాయి, మత్తు పదార్థాలను తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి వాహనాలను నడుపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనం ఇస్తే యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వెల్దుర్తి: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి, ఆగస్టు 04 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1987-88 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 36ఏండ్ల తర్వాత కలుసుకున్న వారు ప్రస్తుత పరిస్థితులు, చిన్ననాటి జ్ఞాపకాలను, చదువుకున్న రోజులను గుర్తు చేసుకొన్నారు. అప్పట్లో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

పాపన్నపేట ఉన్నత పాఠశాలలో..

పాపన్నపేట, ఆగస్టు 4 : మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సందడి చేశారు. ఆదివారం పాపన్నపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు జనార్దన్, సుదర్శన్, ప్రభాకర్, బిచ్చయ్య, మహేందర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు రాజు, యాదగిరి, మున్వర్, ప్రసాద్, సత్యనారాయణ, స్వామిదాస్, కృష్ణమూర్తి, సాయిబాబా, శోభారాణి, మంజుల, మమత, సంతోషీకుమారి, లావణ్య, రూపా తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట : పూర్వ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

అధిక ధరలకు ఎరువుల విక్రయాలు

కౌడిపల్లి, ఆగస్టు 4 : మండల కేంద్రంలోని దుకాణాల్లో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను నిలువుదోపిడీకి గురిచేస్తున్నారు. యూరియా బస్తా ధర రూ.265కి విక్రయించాల్సి ఉండగా 290కి విక్రయిస్తున్నారని, మరో ఎరువుల షాపులో యూరియా బస్తా ధర రూ.265కి విక్రయించాల్సి ఉండగా రూ.300కి విక్రయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బక్కో బస్తాకు రూ.25 నుంచి రూ.35 రైతుల నుంచి బస్తాపై దండుకోవడం ఎంత వరకు సమంజసమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఒరిజినల్ చిట్టీకి బదులు తమ షాపు పేరుపై కొట్టిన మరొక ఫేక్ చిట్టీపై మందుల బిల్లు వేసి ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఒరిజినల్ బిల్లుపై ఒకరేటు, వెనకాల మరొక రేటు రాసి ఇస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధిక డబ్బులు వసూలు చేస్తున్న షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకుల అందజేత

నిత్యావసర సరుకులు అందజేస్తున్న గ్రోస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 4 : గ్రోస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 32 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దీంతో వారు సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్‌ను మంజూరు చేయాలి

మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు పాండు

నిజాంపేట, ఆగస్టు 4 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.6 వేల పెన్షన్‌ను మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పాండు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నిజాంపేటలో నిర్వహించిన దివ్యాంగుల సమావేశానికి పాండు హాజరై మాట్లాడారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న మెదక్‌లో ఏర్పాటు చేసిన సభను విజయవంతం చేయాలన్నారు. దివ్యాంగులను స్మితాసబర్వాల్ విమర్శించడం సమంజసం కాదన్నారు.వెంటనే ఆమె క్షమాపణలు చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పరిష్కరించలేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూమయ్య, రామాయంపేట అధ్యక్షుడు శ్రీను, నిజాంపేట మండల అధ్యక్షుడు నర్సింహులు, ఉపాధ్యక్షుడు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

చిన్నశంకరంపేట, ఆగస్టు 4 : కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని మల్లుపల్లిలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. నిజామబాద్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన కిరణ్(37) 12 ఏండ్ల క్రితం గ్రామానికి చెందిన నర్సింహులు, నర్సవ్వల కూతురు మౌనికను వివాహం చేసుకొని ఇల్లరికం వచ్చాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని నెలలుగా కుటుంబ కలహాలతో సతమతమయ్యేవాడు. ఆదివారం కుటుంబ సభ్యులతో జరిగిన వాగ్వాదంతో మనస్తాపానికి గురైన కిరణ్ స్థానిక డంపింగ్ యార్డులో ఉరి వేసుకొన్నాడు. అత్తగారి వేధింపులతోనే కిరణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనగా స్థానిక పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు.

లయన్స్ ఉత్తమ జిల్లా చైర్మన్‌గా ఏలేటి

ఏలేటి రాజశేఖర్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అంతర్జాతీయ డైరెక్టర్ బాబురావు

రామాయంపేట, ఆగస్టు 4 : రామాయంపేట లయన్స్ క్లబ్ చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డిని స్టార్‌లైన్, ఉత్తమ జిల్లా చైర్మన్‌గా ఎంపిక చేశారు. శనివారం రాత్రి హైదరాబాద్ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా కొంపల్లిలోని కేవీఆర్ కన్వెన్షన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఏలేటి రాజ శేఖర్‌రెడ్డిని సన్మానించారు. ఉత్తమ సేవలు చేసినందుకు ఉత్తమ జిల్లా చైర్మన్‌గా ఎంపిక చేసి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయ క్లబ్ నిర్వాహకులు జిల్లాలోనే స్టార్‌లైన్, ఉత్తమ చైర్మన్‌గా ఎంపిక చేయడంతో మరింత భాద్యత పెరిగిందన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

నర్సాపూర్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతులు

నర్సాపూర్, ఆగస్టు 4 : కొండపోచమ్మ కాల్వ వద్దు సెమీ అర్బన్ ముద్దు అంటూ నర్సాపూర్ పట్టణంలో భూములు కోల్పోతున్న రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 24వ రోజుకు చేరుకుంది. రైతులు చేస్తున్న దీక్షకు లోక్‌సత్తా పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్, సీపీఎం నాయకుడు నాగరాజు, ప్రముఖ వ్యాపారవేత్త నరేందర్ మద్దతు తెలుపుతూ దీక్షలో కూర్చున్నారు. అంతకు ముందు గుండెపోటుతో మృతి చెందిన రైతు రాంరెడ్డికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధికి అడ్డుగా మారే ఈ కాల్వ నిర్మాణంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో చిన్నచింతకుంట, గొల్లపల్లి, బ్రాహ్మణపల్లి, చెన్నాపూర్ రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

నర్సాపూర్, ఆగస్టు 4 : రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు గాయపడిన ఘటన నర్సాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని లింగాపూర్‌కు చెందిన నిమ్మగళ్లప్రభు, నిమ్మగళ్ల చిన్న బైక్‌పై వస్తూ నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తాలో ఆగి ఉన్న లారీని వెనకాల నుంచి ఢీకొట్టడంతో ఇరువురి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దావాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ దావాఖానకు తరలించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PUBLIC HEALTH CHEMICALS
టెమీ ఫాస్ 50% EC, మలాథియన్ 50% EC, పైరిత్రమ్ 2% EC, డెల్టామెత్రిన్ 1.25% ULV, MLO ఆయిల్, పైరోసిన్ ఆయిల్ etc. మునిసిపల్ కార్పొరేషన్స్‌కి, గ్రామ పంచాయతీలకి మరియు నగర పంచాయతీలకి సప్లై చేయబడును. డీలర్స్ మరియు మునిసిపల్ కాంట్రాక్టర్స్ సంప్రదించవలసిన నంబర్లు
9346771599, 8790185234, 9701298656

WATER PROOFING
★ Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124

WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325783-All

★ మెదక్ జిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు/ గార్డ్స్ కావలెను. నెలకు జీతం 21000/17000. ESI, PF సౌకర్యం కలదు. అర్హత డిగ్రీ/ టెన్త్, వయస్సు 20-40 సం.లోపు, ఎత్తు 5.6" మంచి అనుభవం కలవారు కావలెను. అన్ని వసతులు కలిగిన ఉచిత బ్యాచిలర్ రూమ్ కలదు. సెల్ నెం: 8341038715, 9848328701, 8919606707.
NT-98111

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.